ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తనపై విచారణ

పిఠాపురం: పాఠశాలల్లో బాలికల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీవై ఈఓ సుభద్ర తెలిపారు. పట్టణంలోని ఒక ప్రైయివేటు పాఠశాలలో 7వ తరగతి విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడు దుర్గారావు అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై ఆమె శనివారం విచారణ చేపట్టారు. బాలిక తల్లి ఫిర్యాదుపై కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ నిర్వహించామన్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆమె తెలిపారు.

సత్యదేవుని భక్తులకు దసరా కానుక..!

- స్వామివారి ప్రదక్షణ దర్శనమార్గంలో కామధేనువు, కల్పవృక్షం, బంగారు హుండీ ఏర్పాటుకు సన్నాహాలు
- రూ.20 లక్షలతో ఏర్పాటు చేయనున్న దాత సత్తి సూర్యనారాయణరెడ్డి
- 15 నుంచి భక్తులకు అందుబాటులోకి..


రత్నగిరిపై ఆలయ చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్‌తో చర్చిస్తున్న దాత పెదబాబు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని భక్తులకు శుభవార్త. దసరా వేడుకల నేపథ్యంలో ఈ నెల 15 నుంచి స్వామివారి ప్రధానాలయంలోని ప్రదక్షణ దర్శన మార్గంలో బంగారు కల్పవృక్షం, బంగారు కామధేనువు, బంగారు హుండీ, బంగారు గందపు గిన్నెలను ఏర్పాటు చేయనున్నారు. భక్తులు ప్రధానాలయంలో ప్రదక్షణ చేస్తూ వీటిని దర్శిస్తారు. అనంతరం సత్యదేవుని దర్శించే అవకాశం కల్పిస్తారు. సత్యదేవునికి అభిషేకం చేసిన గంధం ఇక్కడ ఏర్పాటు చేసే గిన్నెలో వేస్తారు. భక్తులు వీటిని నుదిటిన ధరించే అవకాశం కల్పించనున్నారు. తొండంగి మండలం దానవాయిపేటకు చెందిన దాత, సప్తగిరి హేచరీస్ అధినేత సత్తి సూర్యనారాయణ రెడ్డి (పెదబాబు) తన తండ్రి సత్తి సుబ్బారెడ్డి పేరు మీద రూ.20 లక్షలతో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్ శనివారం తెలిపారు.

ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు

దాత పెదబాబు శనివారం దేవస్థానానికి వచ్చారు. ఆలయ చైర్మన్, ఈఓలను కలిసి ప్రదక్షణ దర్శన మార్గంలో వీటిని తన సొంత ఖర్చుతో ఏర్పాటు చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. దాత పెదబాబు గతంలో సత్యదేవుని వార్షిక కల్యాణ వేదిక నిర్మించి దేవస్థానానికి అందజేశారు. ఆ కల్యాణ వేదిక మీద స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవాలతో పాలు పలు వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా దేవస్థానంలో పలు కార్యక్రమాలకు ఆయన విరాళాలు సమర్పించారు.

రాగితో తయారు చేసి బంగారు పూత

రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ శిల్పులు కామధేనువు, కల్పవృక్షం, బంగారు హుండీ, గంధపు గిన్నెలను రూపొందిస్తున్నారు. స్వచ్ఛమైన రాగితో వీటిని తయారు చేసి వాటిపై బంగారు పూత పూస్తారని ఈఓ తెలిపారు. ఆ తరువాత భక్తులు చేతులు వేసినా దెబ్బతినకుండా వాటిపై ప్లాస్టిక్ పేపర్‌తో లామినేషన్ చేయిస్తామని తెలిపారు. ప్రదక్షిణ మార్గంలో నైరుతి, ఈశాన్యం, వాయువ్యం, ఆగ్నేయ మూలల్లో వీటిని ఏర్పాటు చేసి నిత్యం పండితులు పూజలు చేస్తారని తెలిపారు. భక్తులు ప్రదక్షణ మార్గంలో వీటిని దర్శించి అనంతరం అంతరాలయంలో సత్యదేవుడు, అమ్మవారిని దర్శించుకునే వీలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం వైదిక కార్యక్రమాల సూపర్‌వైజర్ నాగాభట్ల కామేశ్వరశర్మ, ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు, వ్రతపురోహిత సంఘం నాయకుడు రవిశర్మ, వేద పండితుడు ముష్టి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలపై ఆరోపణలు సిగ్గుచేటు

- టీడీపీ నేతలపై మండిపడిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- గోకవరం ప్రభుత్వాస్పత్రిలో మీడియా సమావేశం


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, డాక్టర్లు

గోకవరం: రాష్ట్రంలోనే మెరుగైన వైద్య సేవలందిస్తున్న గోకవరం ప్రభుత్వాస్పత్రిపై టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సొమ్ములు దుర్వినియోగం చేస్తున్నారంటూ శుక్రవారం టీడీపీ నాయకులు ధర్నా చేయడంపై వైద్య సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకుడు మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి తదితరులు శనివారం గోకవరం ప్రభుత్వాస్పత్రిలో మీడియా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రిలో ఇంజక్షన్, సిలైన్‌కు డబ్బులు తీసుకుంటున్నారని టీడీపీ నాయకులు అవగాహన లేకుండా ఆరోపణలు చేయడం తగదన్నారు. గోకవరం ప్రభుత్వాస్పత్రి ప్రసూతి వైద్య సేవల్లో ప్రథమ స్థానంలో, ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలు చేయడంలో మూడో స్థానంలో ఉందన్నారు. అటువంటి ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రవర్తించడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత 50 పడకల ఆస్పత్రి నిర్మాణం వేగవంతంగా జరుగుతోందన్నారు. ఆస్పత్రికి వచ్చిన వారందరికీ కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలందిస్తున్నారన్నారు. ఆస్పత్రిపై టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలను రెండు రోజుల్లో నిరూపించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వనజ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చిన రోగికి రూ.8 వేల వైద్యం చేశారన్నారు. దీనికి సంబంధించి ఆరోగ్యశ్రీ ఖర్చు రోగి సెల్‌ఫోన్‌కు మెసేజ్ ద్వారా వచ్చిందన్నారు. ప్రజలు ఆస్పత్రిలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, పెనుగొండ సత్యానందం, బిజ్జి రాజు, మందపాటి సతీష్, మచ్చా మోహన్, ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పిచికారీ.. జాగ్రత్తలు తప్పనిసరి

- ఖరీఫ్ సస్యరక్షణ చర్యల్లో రైతులు బీజీ
- జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు
- ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లో 49,758 ఎకరాల్లో వరి సాగు


వరి పంటకు స్ప్రేయింగ్ చేస్తున్న రైతు

ప్రత్తిపాడు రూరల్: ఖరీఫ్ సాగు చేసిన రైతులు ప్రస్తుతం సస్యరక్షణ చర్యలో బిజీగా ఉన్నారు. పలు ప్రాంతాల్లో వరి పంట దుబ్బు కట్టే దశలో ఉంది. పంటలను తెగుళ్లు ఆశించకుండా రైతులు మందులు పిచికారీ చేస్తున్నారు. కాగా పురుగు మందుల వాడకం, పిచికారీలో తగిన జాగ్రత్త తప్పనిసరిగా తీసుకోవాని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లో ఈ ఏడాది 49,758 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు.

సస్యరక్షణ చర్యల్లో జాగ్రత్తలు ఇలా..

రైతులు ఖరీఫ్ సస్యరక్షణ చర్యల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండల వ్యవసాయాధికారి వైవీ గంగాధర్ వివరించారు. మందులు పిచికారీ చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా ఈ జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

- రెండు లేక మూడు రకాల మందులను కలిపి పిచికారీ చేయకూడదు.
- చేతులకు గ్లౌజులు, కళ్లకు అద్దాలు, ముక్కుకు మాస్క్‌ను తప్పనిసరిగా ధరించాలి.
- పురుగు మందుల డబ్బాల మూతలను నోటితో తీయకూడదు.
- పవర్ స్ప్రేయర్ నాజల్‌ను పెద్దగా చేయకూడదు.
- పిచికారీ సన్నగా తుంపరలా పడేలా చూసుకోవాలి.
- మోతాదు ప్రకారమే మందు కలుపుకోవాలి.

పైరు ఏపుగా ఉన్నప్పుడు స్ప్రేయర్ మాత్రమే ఉపయోగించాలి
పిచికారీ చేసేటపుడు తినడం, తాగడం, పొగ తాగడం, కళ్లు నులుముకోవడం, నోటిలో వేళ్లను పెట్టుకోవడం వంటివి చేయకూడదు.

- గాయాలైన చేతలతో మందులను తాకకూడదు.
- ఎరువులు అవసరం మేరకు వినియోగించాలి. ఏ పంటకైనా మొదటి 45 రోజుల్లో వచ్చే రోగాలను తట్టుకునే సామర్థ్యం ఉంటుంది. రైతులు వ్యవసాయశాఖ అధికారులు సలహాలను పాటిస్తే ఆశించిన దిగుబడి వస్తుంది.

సలహాలు అందిస్తున్నాం



రైతులకు ఎప్పటికప్పుడు పంటల సాగుపై సలహాలను అందిస్తున్నాం. ఏ సమయంలో ఎంత మోతాదులో మందులను ఉపయోగించాలో తెలియజేస్తున్నాం. నాణ్యమైన మందులు, ఎరువులను కూడా ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచుతున్నాం.

–డి.భువనేశ్వరి, గ్రామ అగ్రికల్చర్ సహాయకురాలు, బురదకోట.

జిల్లా శాలివాహన సంక్షేమ సంఘం ఏర్పాటు

కాకినాడ సిటీ: జిల్లాలో శాలివాహనులు (కుమ్మర్లు) ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర శాలివాహన సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్ మండేపూడి పురుషోత్తం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను కలసి కోరారు. ఆ వర్గం సమస్యలను వారు కలెక్టర్‌కు వివరించారు. సంక్షేమ, అభివృద్ధి సంఘాల సభ్యుల నియామక పత్రాలను కలెక్టర్ ద్వారా సభ్యులకు అందించారు. సంఘ సభ్యులుగా అనకాపల్లి నూకరాజు, టిల్లపూడి నాగేశ్వరరావు, డి.రాంబాబు, టి.దొరబాబులు నియమితులు కాగా సంఘ పెద్దలు ఉబ్బిశెట్టి నారాయణరావు, కార్పొరేషన్ డైరెక్టర్ బిళ్లకుర్తి నాగమణి తదితరులు కలెక్టర్‌ను కలసిన వారిలో ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలు

గండేపల్లి: జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు, రోడ్డు సేఫ్టీ సిబ్బంది వివరాల ప్రకారం... విజయవాడ నుంచి విశాఖ వైపు వెళుతున్న లారీ మండలంలోని గండేపల్లి శివారు బాబాయి హోటల్ సమీపంలోకి వచ్చే సరికి నిర్లక్ష్యంగా రోడ్డుపైకి వస్తున్న మరో లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపైకి వస్తున్న లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ప్రమాద స్థలం వద్దకు చేరుకున్న రోడ్డు సేఫ్టీ సిబ్బంది కుమార్, సతీష్ క్షతగాత్రుడుని హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని గండేపల్లి పోలీసులు తెలిపారు.

నిందితుల అరెస్ట్

గండేపల్లి: మండలంలోని పి.నాయకంపల్లిలో ఓ వ్యక్తి మృతికి కారణమైన నిందితులను అరెస్టు చేసినట్టు జగ్గంపేట సీఐ బి.సూర్యఅప్పారావు తెలిపారు. గ్రామానికి చెందిన గంధం అబ్బులు ఇంటి ముందు ఉంటున్నవారు, మరికొందరు కలిసి మంగళవారం రాత్రి అబ్బులుపై దాడి చేయడంతో అబ్బులు అక్కడిక్కడే మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. హత్యకు కారకులైన ఆరుగురిలో ఏ–2 గంధం శాంత కుమారి, ఏ–3 ముప్పిడి వెంకటలక్ష్మి, ఏ–4 కొమ్ముకూరి బేబి, ఏ–5 వేమగిరి వరలక్ష్మిలను శుక్రవారం సాయింత్రం అరెస్ట్ చేశారు. నిందితులను శనివారం పెద్దాపురం కోర్టుకు తరలించగా ఈ నెల 20 వరకు రిమాండ్ విధించినట్టు తెలిపారు. వీరిలో మరో ఇద్దరిని అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. దాడిలో గంధం విజయ్‌కు తలపై గాయం కావడంతో విజయ్‌ను, పరారీలో ఉన్న మహిళను తర్వాలో అరెస్ట్ చేస్తామని తెలిపారు.








ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్యం


కత్తిపూడిలో రోగులకు పరీక్ష రిపోర్ట్, మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్


జె.కొత్తూరులో రోగులకు ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- కత్తిపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష

శంఖవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్య సేవలు అందుతున్నాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని కత్తిపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. డాక్టర్లు సుమారు 500 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గ్రామాల్లో 45 రోజుల పాటు ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తారన్నారు. ఎవరికి ఏ ఆరోగ్య సమస్య ఉన్నా తగిన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. ఆరోగ్యశ్రీని పటిష్టం చేయడం, కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు, పీహెచ్‌సీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలు ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రోగులకు మందులు, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. క్యాక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, వైద్యుడు ఎస్.రాజీవ్, సౌమ్యశ్రీ, సర్పంచ్ కొల్లు సత్తిబాబు, కో ఆప్షన్ సభ్యుడు గాబు కృష్ణ, ఉప సర్పంచ్ గౌతు నాగు, వైఎస్సార్ సీపీ నాయకులు గౌతు అర్జుబాబు, మాదేపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే లక్ష్యం

ఏలేశ్వరం: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యురాలు నీరుకొండ రామకుమారి అన్నారు. మండలంలోని యర్రవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం రోగులకు ఆరోగ్య కిట్లు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరాన్ని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు నీరుకొండ సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు

జగ్గంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని జె.కొత్తూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ సెంటర్‌ను పరిశీలించారు. గర్భిణులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలు వైద్య పరీక్షల కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఉన్న ఊరిలోనే వైద్యం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రజలు ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గ నేత జ్యోతుల రామస్వామి, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావు కాపు, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, జె.కొత్తూరు గ్రామ సర్పంచ్ నకిరెడ్డి నాగేశ్వరరావు, ఎంపీడీఓ వసంతకుమార్, తహసీల్దార్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం

ప్రత్తిపాడు రూరల్: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని గజ్జనపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు మందుల కిట్లు, గర్భిణులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. వైద్యులు కేజీ వెన్నెల, పి.దీక్షిత, జి.నీరజ, గీతా సుధ, కె.మురళీ మోహన్‌రెడ్డి, జి.శివకృష్ణ తదితరులు గ్రామంలోని 521 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు, సర్పంచ్ గొనగాల అప్పలరాజు, ఎంపీటీసీ మొల్లి వీరబాబు, శాలివాహన అభివృద్ధి కమిటీ సభ్యుడు అనకాపల్లి నూకరాజు, పార్టీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను పాల్గొన్నారు.

తుని రూరల్: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. మండలంలోని కుమ్మరిలోవలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శనివారం ఎంపీపీ ప్రారంభించారు. రోగులకు సురక్ష కిట్లను పంపిణీ చేశారు. ఎస్.సూరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ, నాయకులు జక్కాన రామచంద్రరావు, పరవాడ లోవరాజు, చిటికెల వరహాలబాబు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

కోటనందూరు: పేదల ఆరోగ్యానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. మండలంలోని కొత్తకొట్టాంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శనివారం సర్పంచ్ దొగ్గా లక్ష్మితో కలిసి ఆయన ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు సురక్ష కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయల చినబాబు, లోవదేవస్థానం మాజీ చైర్మన్ బొంగు ఉమారావు తదితరులు పాల్గొన్నారు.

రాజవరంలో..

రౌతులపూడి: మండలంలోని రాజవరంలో ఎంపీడీఓ ఎం.గోవిందు ఆధ్వర్యంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు గ్రామంలోని 303 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో 11 మందిని మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కంటి వెలుగులో భాగంగా 101 మందిని పరీక్షించి 86 మందికి కళ్ల జోళ్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు సోమరౌతు నాని, సర్పంచ్ దేవుడు పాల్గొన్నారు.

కిర్లంపూడి: ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని బూరుగుపూడి జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యులు రాంబాబునాయక్, జ్యోతిమణి మాల, అభిషేక్, హిమబిందు, దివ్య 572 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మరో 12 మందిని పెద్ద ఆసుపత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యులు తోట గాంధీ, పార్టీ నాయకులు పాతంశెట్టి కృష్ణమూర్తి, ఆశపు బద్రి, పాతంశెట్టి విశ్వనాథం, కర్రి నారాయణమూర్తి, గొరకపూడి గోపీ, పెంటకోట నాగబాబు, చదలవాడ బాబీ, పెనగంటి రాజేష్, దోమాల గంగాధర్, బొజ్జపు శ్రీను, బొడ్డేటి గణపతి తదితరులు పాల్గొన్నారు.

కోదాడలో...

తొండంగి: మండలంలోని కోదాడలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు ప్రారంభించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. గర్భిణులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యులు పి.రవికుమార్, భారతి, రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పార్టీ నాయకులు కొయ్యా మురళి, దడాల విజయబాబు, పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బూర్తి కృష్ణ, బూర్తినాని తదితరులు పాల్గొన్నారు.


యర్రవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు రామకుమారి


కొత్తకొట్టాంలో జగనన్న సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు


కుమ్మరిలోవలో రోగులకు ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాము, నాయకులు


రాజవరంలో లబ్ధిదారులకు జగనన్న ఆరోగ్య సురక్ష పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

34 మందికి నియామక పత్రాలు అందజేత

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, వికాశ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. ఉద్యోగాలకు ఎంపికైన 34 మందికి కళాశాల ప్రిన్సిపాల్ డి.సునీత నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబ్‌మేళాలో 13 కంపెనీలకు సంబంధించి 740 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. వీటికి 223 మంది అభ్యర్థులు హాజరు కాగా 135 మందిని ఎంపిక చేసినట్టు చెప్పారు. వీరిలో 34 మందికి నియామక పత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ సునీత

ప్రగతి పథంలో పల్లెలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- ఎస్టీ రాజాపురం, కె.గోపాలపురం గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం

గండేపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని ఎస్టీ రాజాపురం, కె.గోపాలపురం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం ఆయన శ్రీకారం చుట్టారు. ఎస్టీ రాజాపురంలో జల జీవన్ మిషన్ నిధులు రూ.47.50 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలు, పైపులైన్లు, వాటర్ ట్యాంక్‌లను ప్రారంభించారు. రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. కె.గోపాలపురంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ (వెల్ నెస్) సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. అన్నివర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, జెడ్పీటీసీ పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, గండేపల్లి, ఉప్పలపాడు సొసైటీ అధ్యక్షులు కేతిన బాబి, పాము సూరిబాబు, సర్పంచులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.


కె.గోపాలపురంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని ఎస్టీ రాజాపురంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు మందులు పంపిణీ చేశారు.




రేపు ధర్మవరంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం కోల్డ్ స్టోరేజ్ వద్ద ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ సారథ్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. జాతీయ రహదారిపై కిర్లంపూడి మండలం సోమవరం గ్రామం వద్ద వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. కిర్లంపూడి మండలం తామరాడ నుంచి మోటారు సైకిల్‌పై సారా తరలిస్తున్న చందక వీరబాబును అరెస్టు చేసి అతని నుంచి బైక్, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అలాగే ఎస్.తిమ్మాపురంలో సారా కేసులో పరారీలో ఉన్న చిమ్మ దుర్గయ్యను అరెస్టు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్సై బి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా బాబ్జి


దడాల బాబ్జి

శంఖవరం: పెద్దాపురం డివిజన్ ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ కమిటీ సభ్యుడిగా కత్తిపూడి గ్రామానికి చెందిన దడాల బాబ్జి రెండోసారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు, గిరిజనుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కమిటీ సభ్యుడిగా తనను రెండోసారి ఎంపిక చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు.



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ముగ్గురి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లిలో శనివారం రాత్రి జగ్గంపేట సీఐ సూర్యఅప్పారావు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరిని రేపు కోర్టులో హాజరు పరుస్తామని సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కాట్రావులపల్లిలో పోలీస్ పికెట్

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లిలో రెండు వర్గాల మధ్య ఘర్షణ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా పోలీస్ పికెట్ నిర్వహిస్తున్నట్టు జగ్గంపే సీఐ సూర్య అప్పారావు శనివారం తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి ప్రశాంతంగా ఉందన్నారు. ఇప్పటికే ఇరువర్గాల వారితో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దామన్నారు. ఎటువంటి కేసులు నమోదు చేయలేదని చెప్పారు. జగ్గంపేట ఎస్సై నాగార్జున రాజు పర్యవేక్షణలో పోలీసుల పహారా కాస్తున్నారని చెప్పారు.


కాట్రావుపల్లిలో పోలీస్ పికెట్







అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. బూరుగుపూడి ప్రభుత్వ పాఠశాలలో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ (ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి) కార్యక్రమం నిర్వాహణపై వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ ప్రజల ఆర్థికాభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలతో మరెన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, పాతంశెట్టి కృష్ణమూర్తి, ఆశపు బద్రి, పెంటకోట నాగబాబు, చదలవాడ బాబీ, దోమాల గంగాధర్, పెనగంటి రాజేష్, గొరకపూడి గోపీ పాల్గొన్నారు.

ప్రజలకు జగనే కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్


హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహణపై సమీక్ష

రౌతులపూడి: ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలందరూ కోరుకుంటున్నారని ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్ అన్నారు. రౌతులపూడిలో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహణపై వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ఆయన సమీక్షంచారు. గడిచిన నాలుగన్నరేళ్లలో ప్రభుత్వం అందించిన పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతీఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు తెలిపారు. అమ్మఒడి, విద్యాదీవెన, వైఎస్సార్ ఆసరా, రైతు భరోసా వంటి ఎన్నో పథకాలు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, ప్రత్తిపాడు ఏఎంసీ చైర్ పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, వైస్ ఎంపీపీ సాయి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మెన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, పార్టీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

10న జాబ్‌మేళా

జగ్గంపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10న జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రనాయుడు, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డి.హరిశేషు శనివారం తెలిపారు. ఈ జాబ్ మేళాలో 4 కంపెనీల్లో 164 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, ఫార్మసీ, ఎంబీఏ, ఎమ్‌కాం చదువుకున్న 35 సంవత్సరాల లోపు యువతీ యువకులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్, విద్యార్హత పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 82477 88247, 86889 77277 నంబర్లను సంప్రదించాలన్నారు.

హార్టీసెట్‌లో సౌజన్యకు 6వ ర్యాంకు


దేవి సౌజన్య

ప్రత్తిపాడు రూరల్: ఏపీ హార్టీ సెట్ ఫలితాల్లో మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన దేవీసౌజన్య ఉత్తమ ప్రతిభ చూపింది. గత నెల 22న డాక్టర్ వైఎస్సార్ హార్టీకల్చర్ యూనివర్సిటీ నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయి. ధర్మవరం గ్రామానికి చెందిన బయాలజీ అధ్యాపకుడు నానిపల్లి శ్రీనివాసరావు, రామలక్ష్మీ దంపతుల కుమార్తె దేవీసౌజన్య రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంకు కైవసం చేసుకుంది. దేవీసౌజన్యను రామచంద్రపురం ఎస్‌కేపీ కాలేజ్ ప్రిన్సిపాల్ చిన్నబ్బాయి, ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు అభినందించారు.

ఘనంగా వినాయక నిమజ్జనాలు


కిర్లంపూడిలో లక్ష్మీగణపతి ఆలయం వద్ద అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ఏలేశ్వరం: గణపతి నవరాత్రులు ముగియడంతో శనివారం పట్టణంలో వినాయక విగ్రహాలను నిమజ్జనాలు చేశారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పలు చోట్ల నెలకొల్పిన వినాయకుని విగ్రహాలను భారీగా ఊరేగించి స్థానిక ఏలేరు నదిలో నిమజ్జనం చేశారు. పట్టణంలోని పైడి మల్లమ్మ గుడి, మార్కెట్ వీధి ఏర్పాటు చేసిన విగ్రహాలను తీన్‌మార్ డ్యాన్సులు, బాణాసంచా కాల్పుల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు. ఊరేగింపులో మహిళలు, యువకులు సందడి చేశారు. స్థానిక కొనేటి చెరువు గట్టు వీధి, దిబ్బలపాలెం కోదండ రామాలయం, సాయి నగర్‌లో అన్నసమారాధనలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్, కోరాడప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు

కిర్లంపూడి: గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో శనివారం అన్నసమారాధనలు నిర్వహించారు. స్థానిక సంత మార్కెట్‌లో వేంచేసిన లక్ష్మీగణపతి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.









జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల పరిశీలన


ఏలేశ్వరం: పట్టణంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను శనివారం హౌసింగ్ సిబ్బంది పరిశీలించారు. హౌసింగ్ డేను పురస్కరించుకుని హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు ఆధ్వర్యంలో సిబ్బంది కాలనీలో ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ మందిరం ప్రారంభం


దళిత నేతలకు రూ1.30 లక్షల నగదు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేత జ్యోతుల రామస్వామి

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరులో ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ మందిరాన్ని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శనివారం ప్రారంభించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామంలో ఇటీవల నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి మందిరం ఏర్పాటు చేయించాలని దళిత నేతలు ఎమ్మెల్యే చంటిబాబును కోరారు. ఎమ్మెల్యే హామీ మేరకు అంబేడ్కర్ విగ్రహం వద్ద మందిరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మందిర నిర్మాణానికి మంజూరు చేయించిన రూ.1.30 లక్షలను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, తన తండ్రి జ్యోతుల రామస్వామి దళిత సంఘ పెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జనపరెడ్డి బాబు,జె.కొత్తూరు గ్రామ సర్పంచి నకిరెడ్డి నాగేశ్వరరావు,గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు,దళిత సంఘ నేతలు పాల్గొన్నారు.

పంచపత్ర కషాయం తయారీపై అవగాహన


ఏలేశ్వరంలో కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఏలేశ్వరం: పట్టణంలో రైతులకు శనివారం పంచపత్ర కషాయం తయారీపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ మజ్జి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వరిలో వచ్చే నల్లి, తెల్లదోమ నివారణకు పంచపత్ర కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరానికి 200 లీటర్ల నీటిలో 4 లీటర్ల కషాయం కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. కషాయం తయారీకి 20 కేజీల ఉల్లిపాయలు, 3 కేజీల వెల్లుల్లి, 5 కేజీల వేపాకు, 5 కేజీల సీతాఫలం, 5 కేజీల మారేడు, 5 కేజీల జిల్లేడు, 5 కేజీల గానుగ, 5 కేజీల నేరేడు, 5 కేజీల ఉమ్మెతు ఆకులను ముద్దలుగా నూరి మరిగించాలన్నారు. దీనిలో పావు కేజీ పసుపు కలిపి వడకట్టి చల్లారిన తరువాత పంటలకు స్ప్రే చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్ పర్సన్స్ ముదర ఏసుబాబు, పొనగంటి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



